



హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో..



భూపాలపల్లి జిల్లా ఆస్పత్రిలో..



ములుగు జిల్లా ఆస్పత్రిలో..



మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో..



ఎంజీఎం ఆస్పత్రిలోని జ్వరాల వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులు



జనగామ జిల్లా ఆస్పత్రిలో..

ఆంధ్రజ్యోతి ఫోకస్

జ్వర పంజా

ఉమ్మడి జిల్లాల్లో సీజనల్ వ్యాధుల విజృంభణ

- డెంగీ, మలేరియా, తదితర జ్వరాలతో మంచం పడుతున్న జనం
- వైద్యం కోసం ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రులకు క్యూ

వివరాలు : 7లో..

జ్వరాలు పంజా విసురుతున్నాయి. అసలే వర్షాకాలం.. మరోవైపు పారిశుధ్య నిర్వహణ లోపంతో అపరిశుభ్రంగా మారుతున్న పరిసరాలు, దోమల వ్యాప్తి ఇందుకు కారణమవుతోంది. సీజనల్ వ్యాధుల నియంత్రణకు యంత్రాంగం చర్యలు చేపడుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం జటిలంగా మారుతోంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాలు వ్యాప్తి చెందుతుండటం జనాలను కలవరపెడుతోంది. ఓ వైపు ప్రతీ ఇంట్లో ఒకరిద్దరు జ్వరబాధితులు ఉంటుండగా.. మరోవైపు చికిత్స కోసం వస్తున్న బాధితులతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. హనుమకొండ ఎంజీఎం, వరంగల్, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లా ఆసుపత్రులతో పాటు పీహెచ్‌సీల్లోని వార్డులు నిండిపోతున్నాయి. ఉమ్మడి జిల్లాకు ఎంతో కీలకమైన ఎంజీఎం ఆస్పత్రిలో పిల్లల వార్డుతోపాటు జనరల్ మెడిసిన్ విభాగంలో మంచానికి ఇద్దరు చొప్పున రోగులు చికిత్స పొందుతుండగా మిగిలిన వార్డులు కూడా కిటకిటలాడుతున్నాయి. ఈ క్రమంలోనే మరణాలు కూడా సంభవిస్తుండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇక ఈ జటిల పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకుంటున్న ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు దందాకు తెరలేపుతున్నారు. చికిత్సలు, నిర్ధారణ పరీక్షల పేరుతో ఎక్కువ మొత్తంలో గుంజుతున్నారని, ప్లేట్‌లెట్స్ ఎక్కించేందుకు ఆస్పత్రి స్థాయిని బట్టి రూ.11వేల నుంచి రూ.15వేల వరకు చార్జ్ చేస్తున్నట్టు తెలుస్తోంది.



మాట్లాడుతున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

విలువిద్యలో అంతర్జాతీయ గుర్తింపు

- గ్రామీణ విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తున్న ఆర్డీఎఫ్
- త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి
- కల్లెడ కళాశాలలో సిబ్బంది క్వార్టర్లు ప్రారంభం

7లో..



విల్లు ఎక్కుపెట్టిన ఇంద్రసేనారెడ్డి

వార్షిక రుణాల లక్ష్యం

అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో

రూ.4,581.31 కోట్లు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 21 : జిల్లా 2024-25 ఆర్థిక సంవత్సర వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం రూ.4,581.31 కోట్లుగా నిర్ధారించినట్లు అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వార్షిక రుణ ప్రణాళిక యాక్షన్‌ప్లాన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో మాట్లాడారు. ఇందులో పంట రుణాలు రూ.1847.31 కోట్లు కేటాయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆర్.సత్యనారాయణ మూర్తి, బీసీ వెల్ఫేర్ అధికారి ఎం.నర్సింహాస్వామి, వ్యవసాయాధికారి అభిమన్యుడు, యూబీఐ మేనేజర్ హేమంత్‌కుమార్, జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



వార్షిక రుణ ప్రణాళిక యాక్షన్ ప్లాన్‌ను విడుదల చేస్తున్న లెనిన్‌వత్సల్ టొప్పో

ఆహ్లాదకరమైన వాతావరణంలో చదివేలా చర్యలు..

జిల్లాలోని గ్రంథాలయాల పాఠకులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ చాంబర్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహబూబాబాద్‌జిల్లాలోని గ్రంథాలయాల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం స్టడీ మెటీరియల్, బుక్స్‌ను అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. క్రమం తప్పకుండా మునిసిపల్, గ్రామ పంచాయతీలు గ్రంథాలయ పన్ను చెల్లించాలన్నారు. రీడింగ్ రూమ్స్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జీ సెక్రటరీ టి. శ్రీలత, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, డీపీఆర్వో రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయాధికారిగా విజయనిర్మల



మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 21 : జిల్లాలోని వ్యవసాయశాఖలో అధికారుల బదిలీలు జరిగాయి. ఖమ్మం జిల్లా వ్యవసాయాధికారిగా పనిచేస్తున్న ఎం.విజయనిర్మలను మహబూబాబాద్ వ్యవసాయశాఖ అధికారిగా బదిలీ చేస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి కె.అభిమన్యుడును నిజామాబాద్ రైతు శిక్షణ కేంద్రానికి బదిలీ చేసి డిప్యూటేషన్‌పై (ఓడీ) ఖమ్మం రైతు శిక్షణ కేంద్రం డీడీఏగా బదిలీ చేశారు. మహబూబాబాద్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు (ఏడీఏ) ఎం.లక్ష్మీనారాయణను వరంగల్ రెగ్యులర్ ఏడీఏగా నియమిస్తూ డైరెక్టర్ అఫ్ అగ్రికల్చర్ గోపి బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఖమ్మం అర్బన్ నుంచి శ్రీనివాసరావు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. మరిపెడ డివిజన్‌లో వ్యవసాయ సంచాలకుడిగా పనిచేస్తున్న కె.శోభన్ బాబు భద్రాద్రి కొత్తగూడెంజిల్లా టెక్నికల్ ఏడీఏగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో ములుగు జిల్లా ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారిగా పనిచేస్తున్న విజయ్‌చందర్ బాధ్యతలు చేపట్టారు. మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ కార్యాలయంలో పనిచేసిన ఏడీఏ టెక్నికల్ వి.రాజనరేందర్‌ను బెల్లంపల్లి రెగ్యులర్ ఏడీఏగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో మంథిని నుంచి ఏడీగా మురళీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి, కాగా, గత కొద్దిరోజుల నుంచి జిల్లాలో భారీగా మండల వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది కూడా బదిలీ అయ్యారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తా

- రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మాట్లాడుతున్న రియాజ్

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 21 : తెలంగాణలోని గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని బుధవారం సందర్శించి, పాఠకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను వినియోగించుకుని విజ్ఞానవంతులుగా తయారై సమాజంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. గ్రంథాలయ పాఠకులుగా ప్రతిరోజు జిల్లా గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. జిల్లా గ్రంథాలయానికి తనవంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని చెప్పారు. తెలంగాణలోని గ్రంథాలయాలకు పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి టి.శ్రీలత, లైబ్రేరియన్ జి.విజేందర్, సీహెచ్.రవి, రుద్రారపు వీరేందర్, భూలక్ష్మి పాల్గొన్నారు.

అర్హులందరికీ రూ.2లక్షలు మాఫీ చేయాలి

- లోన్ ఇచ్చినప్పుడు లేని షరతులు ఇప్పుడెందుకు?
- కర్షకుల అప్పుమాఫీ చేసేవరకు పోరాడుతాం
- మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర, ఆగస్టు21 : రైతులందరికీ ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పి, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని, అర్హులందరికీ మాఫీచేసే వరకు రైతుల తరపున పోరాడుతామని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. పెద్దవంగర మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతులు రుణమాఫీ కాలేదని చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని, మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రూ.రెండు లక్షలు రుణమాఫీ చేస్తామని రాజకీయ లబ్ధి, పొంది ఇప్పుడు షరతులు పెట్టి రైతులను మోసం చేస్తున్నదన్నారు. రైతులందరికీ రుణమాఫీ జరిగేదాకా బీఆర్‌ఎస్ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. పోరాడితేనే ప్రభుత్వం దిగొస్తుందని, రుణమాఫీ చేయాల్సిన రైతుల జాబితా ప్రభుత్వం వద్ద ఉందని, చేతగానితనం వల్ల మాఫీ చేయడం లేదన్నారు. ఎన్నో వాయిదాలు పెట్టిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీఆర్‌ఎస్ ఒత్తిడి వల్లే కొంత మొత్తం రుణమాఫీ చేసిందన్నారు. మాజీ మంత్రి హరీష్‌రావు కీలకంగా వ్యవహరించడంతోనే ప్రభుత్వం దిగొచ్చిందన్నారు. బ్యాంకు లోన్ ఇచ్చేటప్పుడు లేని షరతులు రుణమాఫీ దగ్గర ఎందుకుని ప్రశ్నించారు. రైతుల బాధలను గుర్తించి ఎలాంటి షరతులు లేకుండా అర్హులందరికీ రూ.2 లక్షలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్‌తో మాజీ మంత్రి ఎర్రబెల్లి మాట్లాడి రైతుల పరిస్థితిని వివరించారు.



పెద్దవంగరలో రైతులతో కలిసి ధర్నాలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు



బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతున్న ఎర్రబెల్లి

కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్, శ్రీరాంసుధీర్, శ్రీరాం సంజయ్, పాకనాటి సునిల్‌రెడ్డి, మనోహర్, సమ్మయ్య, యాదగిరిరావు, వెంకన్న, విజయ్‌పాల్‌రెడ్డి, అశోక్, శ్రీరాం రాము, వెంకట్‌రెడ్డి, భాస్కర్, పటేల్, ఊషయ్య, కుమార్, సుభాష్, రవి, రవీందర్, క్రిష్ణారెడ్డి, వెంకన్న, హరీష్, రాంమూర్తి, వేణు, సతీష్, మహేష్, నవీన్, రఘు, అనుదీప్, హఫీజ్ యాకన్న పాల్గొన్నారు.

సీఎంను విమర్శించే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదు

కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఘనపురపు అంజయ్య

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 21 : సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే నైతిక అర్హత బీఆర్‌ఎస్‌కు లేదని కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య అన్నారు. రాష్ట్ర సచివాలయంలో రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తామన్న ముఖ్యమంత్రిపై ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు దుర్భాషలాడడం సరికాదన్నారు. మహబూబాబాద్ డీసీసీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం కోసం త్యాగం చేసిన మహనీయులు రాజీవ్‌గాంధీ విగ్రహం పెడుతామంటే ఎందుకంత కోపమని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమకారులకు ద్రోహం చేసిన పార్టీ బీఆర్‌ఎస్ అని విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు మెప్పు కోసం ఎమ్మెల్సీ రవీందర్‌రావు రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు ఆరెందుల వెంకటేశ్వర్లు, ప్రభాకర్, అల్లం నాగేశ్వర్‌రావు, సతీష్, ఎమ్డీ.హరుణ్, నారోజు సత్యమనోరమ, భూక్య లక్ష్మి, బి.స్వర్ణలత, నిమ్మల శ్రీనివాస్, బానోత్ హరిసింగ్, సిరిపురం వీరన్న చిరంజీవి, రాందాసు పాల్గొన్నారు.

వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదు

మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పాల్వాయి రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 21 : కాంగ్రెస్ నాయకులు వ్యక్తి దూషణలకు దిగడం సరికాదని, రాజకీయ పరంగా మాట్లాడాలే తప్ప వ్యక్తిగత విమర్శలు చేయొద్దని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య రాజకీయంగా కాకుండా ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావుపై వ్యక్తిగత దూషణలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. మహబూబాబాద్ బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో కాలేదని ఎమ్మెల్సీ రవీందర్‌రావు మాట్లాడారే తప్ప.. సీఎం రేవంత్‌రెడ్డిని వ్యక్తిగతంగా దూషించలేదన్నారు. కాంగ్రెస్ నాయకులు అన్‌పార్లమెంటరీ భాష మాట్లాడిన తీరు సరికాదన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, కౌన్సిలర్ ఎడ్ల వేణుమాధవ్, పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్, నాయకులు మంగలంపల్లి కన్న, జెరిపోతుల వెంకన్న, తేళ్ల శ్రీను, గోగుల రాజు, ఆవుల వెంకన్న, మార్నేని రఘు, డౌలాగర్ శంకర్, శివ, సలీం, మడత వెంకన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత



మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 21 : ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు గురువారం (నేడు) నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తున్నామని పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోతు కవిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్ ఆఫీస్ ఎదుట ఉదయం 9.30 గంటలకు రైతాంగంతో కలిసి ధర్నా చేస్తున్నట్లు వివరించారు. ఈ ధర్నాకు ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ హాజరవుతున్నారని, సంఖ్యలో రైతులు ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

గంధంపల్లిలో కుక్కదాడి

తండ్రి, కుమారుడికి గాయాలు..

జిల్లా ఆస్పత్రిలో చికిత్స



8లో..

గాయపడిన సుఫియాన్

విలువిద్యలో అంతర్జాతీయ గుర్తింపు

● గ్రామీణ విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తున్న ఆర్డీఎఫ్ ● త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి



డ్రోన్‌తో పురుగుల మందు పిచికారీని పరిశీలిస్తున్న ఇంద్రసేనారెడ్డి

పర్వతగిరి, ఆగస్టు 21: ఆర్చరీ అకాడమీ ఏర్పాటు చేసి విలువిద్యలో విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి ఎన్నో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పతకాలు సాధించిన ఘనత రూరల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ (ఆర్డీఎఫ్)దేనని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడలో ఆర్డీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వనితా అచ్యుతాపాయ్ జూనియర్ కళాశాలలో అధ్యాపకులకు నిర్మించిన క్వార్టర్స్, ఒకేషనల్ కోర్సులు, ల్యాబ్‌లను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. తొలుత పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఆర్డీఎఫ్ ఆర్చరీ అకాడమీలో విలు విద్యకారులతో మాట్లాడి విల్లు ఎక్కుపెట్టారు. పొలంలో పురుగుల మందును పిచికారీ చేసే డ్రోన్ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ 26ఏళ్ల క్రితం ఆర్డీఎఫ్‌ను స్థాపించి విద్యాలయాలను ఏర్పాటు చేయడమే గాకుండా, వివిధ ప్రాంతాలకు బ్రాంచ్‌లను విస్తరించడం ఆనందంగా ఉందన్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా గ్రామీణ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తున్న ఆర్డీఎఫ్ సేవలు అభినందనీయమన్నారు. గ్రామంలో గతంలోనే కమ్యూనిటీ టాయిలెట్లను నిర్మించారని, కాలేజీ స్టాఫ్ కోసం డబుల్‌బెడ్రూం క్వార్టర్లు నిర్మించడంపై రామ్మోహన్‌రావుకు విద్యపై ఉన్న ఆసక్తిని తెలియజేస్తుందన్నారు. సంస్థకు విరాళాలు అందించే దాతలకు సైతం సంస్థలో విద్యనభ్యసించే విద్యార్థుల ఫలితాలు కూడా ఉత్తేజపరుస్తున్నాయన్నారు. బాలికల విద్యను పెంపొందించాలనే ఉద్దేశంతో పాఠశాల, కళాశాలలో బాలికలకు 50శాతం సీట్లు కేటాయిస్తూ, తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఉచిత విద్య, వసతి కల్పిస్తున్నారని అన్నారు.

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నో ఒడిదుడుకులు వచ్చినా అంకితభావంతో పనిచేస్తున్న ఆర్డీఎఫ్ ఫౌండర్ మెంబర్ ఎర్రబెల్లి రామ్మోహన్‌రావును అభినందించారు. ఆయన తండ్రి వెంకట్రామనర్సయ్య సైతం గతంలో సేవాభావంతో ఎన్నో పనులను చేశారని, జిల్లా పరిషత్ తొలి చైర్మన్‌గా, సొసైటీ అధ్యక్షుడిగా సేవలందించారని గుర్తు చేశారు. ఆర్డీఎఫ్ ఫౌండర్ మెంబర్ ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ దాతల సహకారంతోనే పేద విద్యార్థులకు విద్యను అందించగలుగుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఆర్డీఎఫ్ సెక్రటరీ కిరణ్ అడ్డాల, అనంతపాయ్, ప్రిన్సిపాల్ ఆడెపు జనార్దన్, పాఠశాల హెచ్‌ఎంలు అశోకాచారి, విష్ణు, నాయకులు విజయ్‌చందర్‌రెడ్డి, రావు పద్మ, కొండేటి శ్రీధర్, బొంపెల్లి దేవేందర్‌రావు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన బీజేపీ నేతలు

మండలంలోని కల్లెడ గ్రామంలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని బుధవారం పలువురు బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, ఎస్సీ సెల్ రాష్ట్ర సభ్యుడు కొండేటి శ్రీధర్, జిల్లా నాయకుడు పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పట్టాపురం ఏకాంతంగౌడ్, బొట్ల మధు, సంతోష్ పాల్గొన్నారు.



ల్యాబ్‌లో పరికరాలను పరిశీలిస్తున్న ఇంద్రసేనారెడ్డి



వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద కిటకిటలాడుతున్న రోగులు

వరంగల్ జిల్లాలో 27 డెంగీ కేసులు


మలేరియా ప్రబలుతున్నా లెక్కల్లో లేని వైనం

పోచమ్మమైదాన్, ఆగస్టు 21: వరంగల్ జిల్లా వాసులను జ్వరాల తీవ్రత కలవరానికి గురిచేస్తోంది. జలుబు, దగ్గు, వైరల్ ఫీవర్లతో బాధపడుతున్న వారు ఇంటికొకరు ఉంటున్నారు. డెంగీ, మలేరియా లాంటి కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దాంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. డెంగ్ లక్షణాలతో అనేక మంది ఆస్పత్రుల్లో చేరుతున్నారు. 20రోజుల వ్యవధిలోనే వరంగల్ జిల్లాలో 27 డెంగీ కేసులు నమోదైనట్లు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. గ్రామాలు, పట్టణాలు తేడా లేకుండా జ్వర పీడితులు రోజురోజుకు పెరుగుతున్నారు. వివిధ రకాల వైద్యపరీక్షల కోసం వచ్చినవారితో ల్యాబ్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, మెడికల్ షాపులు రోగులతో నిండిపోతున్నాయి. నగరంతోపాటు శివారు ప్రాంతాలలోనూ డెంగీ కేసులు పెరుగుతున్నాయని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. చిన్నారుల సైతం జ్వరంతో బాధపడుతుండగా పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో వ్యాధుల వివరాలను యాజమాన్యాలు బయటకు రానివ్వడం లేదని, దీంతో నమోదైయ్యే కేసుల వివరాలు ప్రభుత్వ అధికారుల లెక్కలోకి రావడం లేదని తెలుస్తోంది. 2022లో 161, 2023లో 160 డెంగీ కేసులు నమోదవగా ఈ ఏడాది ఎనిమిది నెలల్లో జిల్లాలో మొత్తం 82డెంగీ పాజిటివ్ కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.

అలాగే అనేక మంది మలేరియా, చికున్‌గున్యాతో బాధపడుతున్నప్పటికీ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం మలేరియా, చికున్‌గున్యా కేసులు నమోదవడం లేదని చెబుతుండటం గమనార్హం. ఈ ఏడాది ఇప్పటి వరకు ఏప్రిల్‌లో 3, జూలైలో 3, ఆగస్టులో 2 మలేరియా కేసులు మొత్తం 8 కేసులు మాత్రమే మలేరియా కేసులు నమోదయ్యాయని చెబుతున్నారు. కానీ బయట పరిస్థితి చూస్తే అనేకమంది మలేరియా, చికున్‌గున్యాతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. 2022లో 45, 2023లో 7 మలేరియా కేసులు నమోదవగా, ఈ ఏడాది ఆగస్టు 20 వరకు ఎనిమిది కేసులు నమోదయ్యాయి.

'జ్వర' పంజా

- డెంగీ, మలేరియా, తదితర జ్వరాలతో మంచం పడుతున్న జనం
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు క్యూ



ఉమ్మడి జిల్లాలో సీజనల్ వ్యాధుల విజృంభణ

ఉమ్మడి వరంగల్ జిల్లాపై జ్వరాలు పంజా విసురుతున్నాయి. వర్షాలు విస్తారంగా పడుతుండటంతో పాటు వాతావరణ మార్పులతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా ప్రతీ ఇంట్లో జ్వరబాధితులు మంచాలు పడుతున్నారు. ఈ క్రమంలో చికిత్స కోసం ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అయితే మరణాలు కూడా సంభవిస్తుండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో జ్వరాలు ప్రబలుతున్న తీరుపై 'ఆంధ్రజ్యోతి' ఫోకస్

డెంగీ డేంజర్ బెల్స్

భూపాలపల్లి జిల్లాలో 23 కేసులు

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 21: భూపాలపల్లి జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. మలేరియా, డెంగీ పాజిటివ్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. ముఖ్యంగా డెంగీ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. గత రెండు రోజుల్లో మూడు పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. జనవరి నుంచి ఇప్పటి వరకు 23 మంది ఈ మహమ్మారి బారిన పడ్డారు. అలాగే ఐదు మలేరియా కేసులు నమోదయ్యాయి. ఇవి అధికారిక లెక్కలు మాత్రమే. వైద్యాధికారుల దృష్టికి రాని కేసులో జిల్లాలో అధికంగానే ఉన్నాయని తెలుస్తోంది. విషజ్వరాలు విజృంభిస్తుండటంతో ప్రజలు ఆస్పత్రుల బాట పడుతున్నారు. పల్లెల్లో పారిశుధ్యం లోపించడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. విషజ్వరాలు వ్యాపిస్తున్న గ్రామాల్లో అధికారులు నామమాత్రంగా వైద్య శిబిరాలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రతీ ఏడాది జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో దోమల వల్ల ప్రజలు రోగాల బారినపడకుండా దోమతెరలను పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు అదెక్కడా కానరావడం లేదు.

ఏటా పెరుగుతున్న విషజ్వరాలు

జిల్లాలో విషజ్వరాలు ఏటా పెరుగుతున్నట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. గతేడాది 83కుపైగా డెంగీ కేసులు నమోదయ్యాయి. 2022లో ఏడు, 2021లో 11, 2022లో 42, 2023లో 85 నమోదయ్యాయి. ఈ 8నెలల్లోనే 23 కేసులు నమోదవగా మరో నాలుగు నెలల్లో ఇంకా పెరిగే అవకా శాలున్నట్టు తెలుస్తోంది. మరోవైపు మలేరియా కేసులు కూడా జిల్లాలో అక్కడక్కడ నమో దవుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు ఐదుగురు దీని బారిన పడ్డారు. చికున్‌గున్యా కేసులు మాత్రం నాలుగేళ్లలో కానరాలేదు. 2020 నుంచి నేటివరకు నమోదవలేదని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి. గత 24 గంటల్లో మూడు పాజిటివ్ కేసులు నమోదవగా భూపాలపల్లి, రేగొండ, కాటారం పీహెచ్‌సీల పరిధిల్లో ఒకొక్కరు చొప్పున జ్వరాల బారిన పడ్డారు. ఇక జిల్లాలో నమోదైన 23 కేసుల్లో అత్యధికంగా భూపాలపల్లి పరిధిలోనే ఉన్నాయి.

ఆస్పత్రులకు క్యూకడుతున్న ప్రజలు

జ్వరాలతో ప్రజలు ఆస్పత్రుల బాటపడుతున్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్) రోగుల తాకిడి విపరీతంగా ఉంది. రోజూ 650మంది ఓపీ పరీక్షలు చేయించుకుంటున్నారని, వీరిలో 500కు పైగా మంది జ్వరాలతో బాధపడే వారే ఉన్నారని తెలుస్తోంది. దీంతో ఈ ఆస్పత్రిలో ప్రత్యేకంగా ఆరు పడకల మెడికల్ ఐసీయూను ఏర్పాటు చేశారు. టీ-హబ్‌లో రోజూ జిల్లాలోని 13 పీహెచ్‌సీలు, రెండు సీహెచ్‌సీల నుంచి వచ్చిన 80-100 శ్యాంపిళ్ల పరీక్షలు నిర్వహిస్తున్నారు. మంగళవారం వచ్చిన 80శాంపిల్స్‌లో మూడు పాజిటివ్‌గా నిర్ధారణైంది.


భూపాలపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కిటకిటలాడుతున్న వార్డులు

మంచానికి ఇద్దరు..

జ్వరబాధితులతో ఎంజీఎం కిటకిట

హనుమకొండ జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు

పీహెచ్‌సీలకు క్యూ కడుతున్న జనం


ఎంజీఎం ఓపీలో బారులు తీరిన రోగులు

వరంగల్ మెడికల్, ఆగస్టు 20: ఉమ్మడి జిల్లాలో జ్వరాలు పంజా విసురుతున్నాయి. డెంగీ, మలేరియా, ఇతర వైరల్ ఫీవర్లతో జనం సతమతమవుతున్నారు. ప్రస్తుతం ప్రతీ ఇంట్లో ఒక్కరైనా జ్వరపీడితులు కనిపిస్తున్నారు. ఏ ప్రైవేటు ఆస్పత్రి చూసినా రోగులతో కిటకిటలాడుతోంది. ఇక ప్రభుత్వ ఆస్పత్రుల్లో అయితే మంచానికి ఇద్దరు చొప్పున చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉన్నా అంతకంటే వేగంగా వైరస్ విస్తరించడం పట్ల వైద్యులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎంజీఎం ఆస్పత్రిలో పిల్లల వార్డుతోపాటు జనరల్ మెడిసిన్ విభాగంలో మంచానికి ఇద్దరు చొప్పున చికిత్స పొందుతున్నారు. వార్డులన్నీ కిటకిటలాడుతున్నాయి. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా జ్వర బాధితులు క్యూ కడుతున్నారు.

వైద్య పరీక్షలు కీలకం

డెంగీ వ్యాధి నిర్ధారణలో వైద్య పరీక్షలు కీలకంగా మారా యి. ఐజీఎం పరీక్షలతోనే కచ్చితత్వం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఆర్‌డీటీ ప్లేట్‌లెట్ కౌంట్, సీరం టెస్ట్ విధా నంలో పరీక్షలు నిర్వహించడం సరికాదని సీనియర్ వైద్యు లు చెబుతున్నారు. ర్యాపిడ్ డయాగ్నోస్టిక్ పరీక్షలు 100 శాతం నమ్మశక్యం కాదని అంటున్నారు. యాంటిజెన్ పాజి టివ్ ఉంటేనే 100శాతం వ్యాధి ఉన్నట్లు నిర్ధారించుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు.


ఎంజీఎంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఎంజీఎంలో డెంగీ, మలేరియా కేసులు

సంవత్సరం	మలేరియా	డెంగీ	చికున్‌గున్యా
2020	194	73	0
2021	310	128	0
2022	229	615	0
2023	93	821	0
2024	23	234	0

దండుకుంటున్న ప్రైవేటు ఆస్పత్రులు

హనుమకొండ, వరంగల్ నగరాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులన్నీ వైరల్ ఫీవర్ బాధితులతో కిటకిటలాడుతున్నాయి. కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు.. పరిస్థితులను ఆసరా చేసుకుని దండుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో జ్వరానికి చికిత్సకు రూ.50వేల నుంచి లక్షకు పైగానే ఖర్చు చేయాల్సిన దుస్థితి ఎదురవుతోంది. ములుగురోడ్డులోని ఓ కార్పొరేట్ ప్రైవేట్ ఆస్పత్రి తమ ఐదు అంతస్తులను ఫీవర్ వార్డులుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నట్టు తెలుస్తోంది. అదే విధంగా బాలసముద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి జ్వరం వచ్చారంటే చాలు.. అడ్మిట్ అయితేనే చికిత్స అంటూ రోగులను భయభ్రాంతులకు గురిచేస్తూ కరోనా కాలం కంటే ఎక్కువ సొమ్మును కాజేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

అధిక ధరలకు 'ప్లేట్‌లెట్స్'

ప్లేట్‌లెట్స్ పడిపోయినప్పుడు అందించే సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్‌లను ఈ సీజన్ అదనుగా చూసుకొని అధిక ధరలకు ఇస్తున్నట్టు రోగులు వాపోతున్నారు. ఆస్పత్రి స్థాయిని బట్టి ఈ ప్లేట్‌లెట్లను రూ.11వేల నుంచి రూ.15వేల వరకు విక్రయిస్తున్నారని, పేదల ఆస్పత్రి అయిన ఎంజీఎంలో ఈ యంత్రం లేకపోవడంవల్ల ప్రైవేట్ వైపు మొగ్గు చూపాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.

ముందు జాగ్రత్తలు

డెంగీ జ్వరం వస్తే తీవ్రత తగ్గించేందుకు చల్లని నీటితో మొత్తని వస్త్రం లేదంటే స్పాంజీని ముంచి శరీరాన్ని తుడవాలి. తక్షణశక్తినిచ్చే పౌడర్లు, పండ్ల రసాలు తాగించాలి. దీనివల్ల జ్వర తీవ్రత తగ్గి ప్లేట్‌లెట్స్ అదుపులోకి వస్తాయి. ప్రతి ఒక్కరూ డ్రైడేను డ్రైడేగా పాటించి పరిసరాల పరిశుభ్రత పాటించాల్సి ఉంటుంది. డెంగీని గుర్తిస్తే 20 శాతం వరకు ఎలాంటి ప్రమాదం లేకుండా చికిత్స పొందవచ్చునని వైద్యులు చెబుతున్నారు.

ప్లేట్స్‌లెట్స్ తగ్గితే సొంత వైద్యం వద్దు..

డాక్టర్ దుర్గం వెంకటేశ్, ఫిజిషియన్, ఎంజీఎం



ప్లేట్‌లెట్ సంఖ్య తగ్గితే సొంత వైద్యం చేయిం చుకోవద్దు. వైద్యుల పర్యవేక్షణలోనే చికిత్స పొం దాలి. వైరల్ జ్వరం వచ్చిన వారు హెపటైటిస్ పరీక్ష చేయించుకోవడం ఉత్తమం. చాలా మంది డెంగీ బాధితులకు బొప్పాయి పండు తినడం వల్ల కడుపునొప్పి, వాంతులు లాంటివి ఉంటాయి. తీవ్రమైన జ్వరం, శరీరంపై దద్దుర్లు, తలనొప్పి, వాంతులు లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.


మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఓపీ కోసం బారులు తీరిన రోగులు, బంధువులు

మానుకోట జిల్లాలో మరింత విజృంభణ

● ఇప్పటికే ఇద్దరు మృతి ● 250 డెంగీ, 12 మలేరియా కేసులు నమోదు

మహబూబాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణాలు, గ్రామాలు, తండాలు.. ఇలా మహబూబాబాద్ జిల్లాలో జ్వరాలు మరింత విజృంభిస్తున్నాయి. ప్రతీ ఇంట్లో ఒకరిద్దరు చొప్పున జ్వరబాధితులు మంచం పట్టారు. దీంతో జనం జ్వర భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. ఇప్పటికే జిల్లాలో జ్వరాలతో ఇద్దరు మృతి చెందడంతో ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు. డెంగీ, మలేరియా, జ్వరాలు వ్యాప్తి పెరగడంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయి. జిల్లాలోని కేసముద్రం మండలం బేరువాడకు చెందిన ఒకరు, తొర్రూరు మండల కేంద్రానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి మృతి చెందారు. జిల్లాలో సాధారణం కంటే ఎక్కువగా కేసులు నమోదవుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో 250 డెంగీ, 12మలేరియా కేసులు, 48,664 మంది ఇతర జ్వరాలతో బాధపడుతున్నట్టు వైద్యాధికారులు గుర్తించారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో రోజూ 1600 నుంచి సుమారు 2 వేల మంది వరకు ఓపీ పేషెంట్లు వస్తుండగా, అందులో సగానికి పైగా జ్వర లక్షణాలున్నవారేనని వైద్యులు చెబుతున్నారు. జిల్లాలోని కొత్తగూడ, అయోధ్యపురం, తీగలవేణి, ముల్కనూరు, కురవి, డోర్నకల్ మల్యాల, మహబూబాబాద్ అర్బన్, కేసముద్రం, నెల్లికుదురు, మరిపెడ ప్రాంతాల్లో అధికంగా డెంగీ, మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల పరిధిలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మానుకోట జిల్లాలోని 21 పీహెచ్‌సీల్లో కేసులు నమోదయ్యాయిలా..

సంవత్సరం	డెంగీ	మలేరియా	ఇతర వ్యాధి
2022	125	20	–
2023	40	06	–
2024	250	12	48,664


మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఓపీ వద్ద భారీగా ఉన్న రోగులు

నామమాత్రంగా వైద్య శిబిరాలు

విస్తారంగా వర్షాలు కురవడం, వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ క్రమంలో గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాల్సిన వైద్యాధికారులు.. నామ్‌కేవాస్తేగా పల్లెల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా గ్రామాల్లో పూర్తిస్థాయిలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉంది. దీనికి తోడు గ్రామపంచాయతీ పాలక మండలి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించి వ్యాధుల నియంత్రణకు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి..

గుండాల మురళీధర్, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో, మహబూబాబాద్



సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర జ్వరాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇతర ఆరోగ్య సూత్రాలు పాటించాలి. ఏ మాత్రం అలసట అనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

దోమలమందు పిచికారీ చేయాలి

బానోత్ విష్ణు, సీరోలు, మహబూబాబాద్ జిల్లా



వరుసగా కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లోని మురుగుకాల్వలు, కుంటల్లో నీరు నిలిచిపోయింది. దీంతో ఆయా ప్రాంతాల్లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. అధికారులు గ్రామాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయాలి. దీంతో పాటు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రతీ ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించాలి.

వణుకుతున్న ఏజెన్సీ గ్రామాలు

● ప్రబలుతున్న జ్వరాలతో గిరిబిడ్డల బెంబేలు ● కొనసాగుతున్న ఫీవర్ సర్వే

ములుగు, ఆగస్టు 21: ఏజెన్సీ పల్లెల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. వానాకాలం ప్రారంభమైన తర్వాత ఊళ్లకుఊళ్లు మంచం పడుతున్నాయి. ఏ ఇల్లు చూసినా ఒకరిద్దరు జ్వర పీడితులు కనిపిస్తున్నారు. వ్యాధుల నివారణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నప్పటికీ పారిశుధ్య నిర్వహణలో లోపం, కలుషితతాగునీరు, వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట పడడంలేదు. ఈ క్రమంలోఆస్పత్రులు జ్వరబాధితులతో నిండుతున్నాయి. ములుగు ఏరియా వైద్యశాల, ఏటూరునాగారం, వెంకటాపురం(నూగూరు) సామాజిక వైద్యశాలలతోపాటు 15 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు నిత్యం వందలాది మంది జ్వరపీడితులు వస్తున్నారు. ఏరియా ఆస్పత్రి, సామాజిక వైద్యశాలల్లో బెడ్లన్నీ నిండిపోతుండగా పీహెచ్‌సీలలో అందుబాటులో ఉన్న బెడ్లపై చికిత్స అందిస్తున్నారు.

రెండునెలల్లో 67 డెంగీ, మలేరియా కేసులు

వైద్య ఆరోగ్యశాఖ ప్రతిఏటా ఇంటింటా ఫీవర్ సర్వేలు నిర్వహిస్తోంది. సమస్యాత్మక గ్రామాలను ముందే గుర్తించి క్లోరినేషన్, దోమల నివారణ మందును పిచికారీ చేయిస్తోంది. ములుగు జిల్లాలో ఈసారి 123 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ముందస్తు వ్యాధుల నివారణ చర్యలు చేపట్టారు. అయినప్పటికీ పరిస్థితి అదుపులోకి రాలేదు. జూన్, జూలై, ఆగస్టు 20 వరకు నిర్వహించిన జ్వర సర్వేలో 60,136 మందికి జ్వరం సోకినట్లు తేలింది. వీరందరి రక్త నమూనాలు సేకరించి పరీక్షించగా 34 మందికి మలేరియా, 33 మందికి డెంగీ నిర్ధారణ అయింది. అత్యధికంగా ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి వచ్చిన రోగుల్లో 21 మందికి డెంగీ, 13 మందికి మలేరియా నిర్ధారణ అయింది.

ఆందోళన కలిగిస్తున్న మరణాలు

జ్వరంతో బాధపడుతున్న పలువురు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగిస్తోంది. అయితే... ఈ మరణాలను వైద్య ఆరోగ్యశాఖ నమోదు చేయలేదు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మృతిచెందినట్లు పేర్కొంటున్నారు. ములుగు మండలం జాకారంలో ఇటీవల ఓ నిండు గర్భిణి, వాజేడు మండలానికి చెందిన మరో గర్భిణి జ్వరంతో బాధపడుతూ మరణించారు. వాజేడు మండలానికి చెందిన మరో మహిళ కూడా డెంగీ లక్షణాలతో మృతిచెందింది. మంగపేట మండలంలో మూడునెలల కాలంలో తొమ్మిది మంది జ్వరంతో మరణించినట్టు తెలుస్తోంది.


కన్నాయిగూడెం పీహెచ్‌సీకి వచ్చిన బాలింత

పీహెచ్‌సీలకు ప్రత్యేక నిధులు

జ్వరాలు విజృంభిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో పీహెచ్‌సీలకు కలెక్టర్ ప్రత్యేక నిధులను కేటాయించారు. మంత్రి సీతక్క ఆదేశాలతో ఒక్కో పీహెచ్‌సీకి రూ.50వేల చొప్పున మంజూరు చేశారు. వీటితో అవసరమైన మలేరియా, డెంగీ టెస్టింగ్ కిట్లను సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా ములుగులోని ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేసి వైద్యులతో సమీక్ష జరిపిన కలెక్టర్ మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. టీ-డయాగ్నోహబ్‌లో లోపాలను గుర్తించి సాంకేతిక సమస్యలను పరిష్కరించి వ్యాధి నిర్ధారణ పరీక్షలను పునరుద్ధరించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించేలా చర్యలు చేపడుతున్నారు.


మంగపేట పీహెచ్‌సీకి వచ్చిన జ్వరపీడితులు


ములుగు ఏరియా ఆస్పత్రిలో మందులు తీసుకుంటున్న దృశ్యం

జనగామలో హైఫీవర్

జిల్లాలో పెరుగుతున్న 53 డెంగీ కేసులు

జనగామ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లాను హైఫీవర్ వెంటాడుతోంది. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి విషజ్వరాలతో ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారు. జ్వరాలతో వచ్చే బాధితులతో జిల్లాకేంద్రంలోని ప్రధాన ఆసుపత్రితో పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. పట్టణం, పల్లె అనే తేడా లేకుండా పారిశుధ్య నిర్వహణ లోపం కారణంగా జిల్లాలో దోమలు, ఈగలు బెడద తీవ్రంగా ఉండటంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. ఇటీవల 'స్వచ్ఛదనం-పచ్చదనం' పేరుతో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టినా అవి తూతూమంత్రంగానే సాగాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో సీజనల్ కేసులు పెద్దసంఖ్యలో నమోదవుతున్నా అవన్నీ లెక్కలోకి రావడం లేదు. అయితే జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు పీహెచ్‌సీల్లో నిర్ధారణైన కేసులు మాత్రమే అధికారికంగా నమోదవుతున్నాయి. జిల్లాలోని 12 గ్రామాల పరిధిలో ఒక జిల్లా ఆసుపత్రి, 4 సీహెచ్‌సీలు, 13 పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటితో పాటు గ్రామాల్లో ఆర్‌ఎంపీలు, జిల్లాకేంద్రంతో పాటు స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి లాంటి నియోజకవర్గ కేంద్రాల్లో పదుల సంఖ్యలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ రోగులు చికిత్స తీసుకుంటున్నారు. ప్రైవేటుగా చికిత్స తీసుకుంటున్న వారి వివరాలు రికార్డ్ కావడం లేదు. దీంతో జిల్లాలో ప్రభుత్వ లెక్కల కంటే రెట్టింపు కేసులు నమోదవుతున్నట్లు తెలుస్తోంది. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 53 డెంగీ, 6 మలేరియా కేసులు నమోదయ్యాయని, మరో 2వేలకుపైగా సాధారణ జ్వరాలు నమోదైనట్టు అధికారులు చెబుతున్నారు.


జనగామ జిల్లా ఆస్పత్రిలో ఓపీ కోసం వచ్చిన రోగులు

రూ.వేలల్లో ఆసుపత్రి బిల్లులు

ప్రస్తుత పరిస్థితులు ప్రైవేటు ఆసుపత్రులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. జ్వరాలతో అడ్మిట్ అయిన రోగుల నుంచి వైద్యం, నిర్ధారణ పరీక్షలు, స్కానింగుల పేరుతో రూ.వేలకు వేలు బిల్లులు వేస్తున్నారు. చిన్నపాటి జ్వరానికే హడావిడి చేస్తున్నారని, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాలైతే ఇక వారి ఇష్టారాజ్యమన్నట్టుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఈ క్రమంలో ఓపీకి వచ్చిన పేషెంట్లకు టెస్టులు, మందులతో కలిపి రూ.5వేలకు పైనే అవుతుండగా అడ్మిట్ వారికైతే రూ.30వేలు, ప్లేట్స్‌లెట్స్ తగ్గడంలాంటి సమస్య వస్తే రూ.50వేలపైనే అవుతున్నాయి. అధికారుల నిఘా లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు, డాక్టర్లు 'తాము ఆడిందే ఆట' అన్నట్టుగా వసూలు చేస్తున్నారన్న అభిప్రాయాలున్నాయి.

ఐదేళ్లుగా జిల్లాలో నమోదైన కేసులు

వ్యాధి	2020	2021	2022	2023	2024
డెంగీ	6	15	34	45	53
మలేరియా	6	7	7	8	4
చికున్‌గున్యా	0	0	0	0	0
మొత్తం	12	22	41	53	57

జిల్లాలో భారత్‌బంద్ ప్రశాంతం

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 21 : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జిల్లాలో బుధవారం మాలమహానాడు, బీఎస్పీ చేపట్టిన భారత్ బంద్ ప్రశాతంగా ముగిసింది. మాల మహానాడు, బీఎస్పీ నేతలు ఉదయాన్నే జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో వద్దకు చేరుకుని బస్సులను బయటకు వెళ్లకుండా డిపో ఎదుట బైఠాయించారు. ఉదయం వేళలో సుమారు రెండుగంటల పాటు ఆర్టీసీ బస్సులను బయటకు రాకుండా అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళన కారులతో మాట్లాడి ఆర్టీసీ బస్సులను బయటకు పంపించారు. భారత్ బంద్ సందర్భంగా పట్టణంలో కొన్నిషాపులు బంద్ చేయగా మరి కొన్ని తెరిచిఉంచగా మాలమహానాడు, బీఎస్పీ నేతలు బైక్‌లపై తిరుగుతూ వాటిని మూసి వేయించారు. జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థలు ముందస్తుగానే పాఠశాలలకు సెలవును ప్రకటించారు. జిల్లాలో ఎలాంటి సంఘటనలకు తావులేకుండా భారత్ బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా మాలమహానాడు జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్ మాట్లాడుతూ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించకుండా రాష్ట్రాల్లో అమలు చేసుకోవడం ఎలా సాధ్య మవుతుందన్నారు. అనంతరం బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసినివాళులర్పించారు. బెజ్జం ఐలేష్, దారా కుమార్, గుండాల భిక్షం, రమేష్‌చందర్, మహేష్, ఉపేందర్, ముత్తయ్య, సాత్విక్, దార ప్రసాద్, ఇనంపెల్లి ఉపేందర్, గుగులోతు నరేష్‌నాయక్, హేమంత్, శ్రీనివాస్, వినయ్ పాల్గొన్నారు.


మానుకోట ఆర్టీసీ డిపో ఎదుట ఆందోళన చేస్తున్న మాలమహానాడు, బీఎస్పీ నేతలు

వివిధ మండలాల్లో..

మరిపెడ మునిసిపల్ కేంద్రంలో మాల మహనాడు నాయకులు చేపట్టిన బంద్ సంపూర్ణంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో గుమ్మడి ప్రభాకర్, మేరుగు సంజీవ, బెస్త సంజీవ, వెంకటమల్లు, బూరుగుల వెంకన్న, ఉపేందర్, ప్రవీన్, రమేష్ పాల్గొన్నారు.

- నెల్లికుదురులో మాల మహానాడు నాయకులు అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్, కారం ప్రశాంత్, దాసరి ప్రకాష్, యాకూబ్, ప్రశాంత్, రాంబాబు, సంజీవ, రజినీ, దర్గయ్య, ఉప్పలయ్య, వెంకన్న, ఎల్లయ్య సమ్మయ్య, రామచంద్రు, సత్తయ్య పాల్గొన్నారు.
- తొర్రూరులో మాలమహానాడు ఆధ్వర్యంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, నాగన్న, శ్రీనివాస్, శ్రీకాంత్, వరుణ్, కిరణ్, దర్గయ్య, రాజు పాల్గొన్నారు.

గంధంపల్లిలో కుక్క దాడి : తండ్రి, కుమారుడికి గాయాలు

బయ్యారం, ఆగస్టు 21 : వీధికుక్క దాడిలో తండ్రితో పాటు కుమారుడు గాయపడిన ఘటన గంధంపల్లిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం. గంధంపల్లి గ్రామానికి చెందిన షేక్ యూసఫ్ భార్య రిజ్వాన శనివారం రాత్రి తనచిన్న కుమారుడు సుఫియాన్ (3)కు అన్నం తినిపించేందుకు ఇంటి వరండాలో ఉపక్రమించింది. ఈ క్రమంలో హటాత్తుగా వీధి కుక్క సుఫియాన్ దవడ పట్టుకొని కొంత దూరం ఈడ్చుకుంటూ వెళ్లింది. సుఫియాన్ అరపులు వేయగా, ఇంట్లో నుంచి బయటకు వచ్చిన తండ్రి యూసఫ్ కుక్కను లాగే ప్రయత్నం చేశాడు. దీంతో కుక్క యూసఫ్ కాళ్లను గాయపరిచింది. కాగా, గాయపడిన తండ్రికొడుకులు మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ప్రజలను మోసం చేయడమే కాంగ్రెస్ నైజం

- వందశాతం రుణమాఫీ చేయని సీఎం రాజీనామా చేయాలి
- ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

మహబూబాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని, ఎన్నికల సమయంలో అరచేతిలో స్వర్గం చూపి అధికారంలోకి వచ్చాక రైతులకు అన్యాయం చేస్తున్నారని ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి, ఇప్పుడు కొర్రిలు పెడుతున్నారని మండిపడ్డారు. రైతు రుణమాఫీకి రూ.49,500 కోట్లు ఖర్చవుతుందని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ తర్వాత రూ.31 వేల కోట్లు అవసరమవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి క్యాబినెట్ సమావేశంలో చెప్పారని తెలిపారు. బడ్జెట్‌లో రైతు రుణమాఫీకి రూ.26 వేల కోట్లు కేటాయించారని, ఆగస్టు 15 నాటికి రూ.17,933 కోట్లు రుణమాఫీ చేశామని స్వయంగా సీఎంచెప్పారన్నారు. ఇలా పొంతన లేకుండా రైతు రుణమాఫీపై మాట్లాడుతున్నారని అసలు ఇప్పటి వరకు రైతు బ్యాంకు ఖాతాల్లో పడిందని రూ. 7 వేల కోట్లు మాత్రమేనని పేర్కొన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రాష్ట్రంలోని రైతులందరికి రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

నేటి ధర్నాను విజయవంతం చేయాలి..

రాష్ట్రంలో వందశాతం రైతు రుణమాఫీ చేయలేని సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థికమంత్రి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రాజీనామా చేయాలని సత్యవతిరాథోడ్ డిమాండ్ చేశారు. రుణమాఫీ చేయని సీఎం రేవంత్‌రెడ్డికి హరీష్‌రావు రాజీనామా చేయాలని అడిగే నైతిక హక్కులేదని, పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయని సీఎం అందుకు బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలన్నారు. అర్హత గల రైతులకు రుణమాఫీ చేయని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ స్పీకర్‌కు మాత్రం రుణమాఫీ చేశారని చెప్పారు. సీఎం తన స్థాయిని మరిచి ప్రతిపక్షాలపై విమర్శలకు దిగడం సరికాదన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని చెబుతున్న సీఎం కాంగ్రెస్ అగ్ర నేతల మెప్పు పొందడం కోసమేనని అన్నారు. రైతులందరికి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరుపతలపెట్టిన ధర్నాలను జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.


సమావేశంలో మాట్లాడుతున్న సత్యవతిరాథోడ్

జేవీవీ నూతన కమిటీ ఎన్నిక


యాకాంతంగౌడ్, నరేందర్, మోహనకృష్ణ

కేసముద్రం, ఆగస్టు 21 : మండలంలోని కల్వల ఉన్నత పాఠశాల ఆవరణలో జనవిజ్ఞాన వేదిక కేసముద్రం మండల నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంపల్లి దయానంద్ తెలిపారు. ఈ కమిటీ అధ్యక్షునిగా చిర్ర యాకాంతంగౌడ్, ప్రధాన కార్యదర్శిగా బండారు నరేందర్, కోశాధికారిగా గాడుదుల మోహనకృష్ణ, గౌరవ అధ్యక్షులుగా గనె యాదగిరి, చందా గోపి, చెకుముకి కన్వీనర్‌గా నన్నపు రాజు, నర్సింహరాజు, సమతా కన్వీనర్‌గా గనె పావనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు యాకాంతంగౌడ్ మాట్లాడుతూ సమాజంలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించి, మూఢనమ్మకాలను పారద్రోలేందుకు కృషి చేస్తానని తెలిపారు.

దంతాలపల్లి మండల కమిటీ..

దంతాలపల్లి : జన విజ్ఞాన వేదిక మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర ఏకాంతం, నెల్లికుదురు విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు టి.యాకన్న తెలిపారు. అధ్యక్షుడిగా సింగరపు యాకయ్య(అక్షర పాఠశాల ప్రిన్సిపాల్), జనరల్ సెక్రటరీగా శ్రీధర్, కోశాధికారిగా అశోక్‌రెడ్డి, చెకుముకి కన్వీనర్‌గా తుమ్మ రఘురాం ఎన్నికైనట్లు వారు పేర్కొన్నారు.

ఆర్యసమాజ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాఖీ వేడుకలు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 21 : ఆర్యసమాజ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. రాఖీ పౌర్ణమి సంస్కృత దినోత్సవాన్ని పురస్కరించుకుని లోక కల్యాణార్థం ఆర్య సమాజ్ ట్రస్ట్ తరఫున స్థానిక పతంజలి యోగా ఆరోగ్య కేంద్రంలో మూడు రోజులుగా యజ్ఞ బ్రహ్మ శ్రీమతి సవిత ఆర్య బూజుచే వేద పారాయణ యజ్ఞంను నిర్వహించారు. అందులో భాగంగా బుధ వారం ఆర్య సమాజ్ కార్యకర్తలు మహబూబాబాద్ పట్టణంలో ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, డీఎస్పీ తిరుపతి రావు, టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, వైద్యులు జగదీష్, అర్జున్‌రెడ్డిలకు రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్యసమాజ్ ట్రస్ట్ మానుకోట అధ్యక్షుడు నారాయణ ప్రకాశ్‌లోయా పాల్గొన్నారు.


ఎస్పీకి రాఖీ శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్యసమాజ ట్రస్ట్ బాధ్యులు

హత్యాచార నిందితులను శిక్షించాలి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 21 : కోల్‌కత్తాలో జూనియర్ మహిళా డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని రోటరీ క్లబ్ మానుకోట శాఖ అధ్యక్షుడు గూడూరు నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పట్టణంలో మంగళవారం రాత్రి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నెహ్రూసెంటర్ నుంచి అంబేద్కర్‌సెంటర్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోల్‌కత్తా ఘటనకు బాధ్యులను కఠినంగా శిక్షించి ఇలాంటివి పునరావృతం కాకుండా పాలకులు శ్రద్ధ చూపాలన్నారు. మాలె నాగేశ్వర్‌రావు, వద్దుల సురేందర్‌రెడ్డి, పి.సదానందం, తోర్నాల నాగేష్‌కుమార్, వేమిశెట్టి కిషోర్‌కుమార్, జంగాల విజయ్, గిరిధర్‌గుప్తా, రమేష్, సతీష్‌రావు, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మౌనదీక్ష


మానుకోటలో కొవ్వొత్తులతో ఆందోళన చేస్తున్న రోటరీ క్లబ్ బాధ్యులు

- తొర్రూరు : కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ తొర్రూరు పట్టణంలో లయన్స్ క్లబ్ సేవా తరుణి శ్రీవాణి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో మౌనదీక్ష చేపట్టారు. మూతికి నల్ల గుడ్డలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సేవా తరుణి చార్టర్ ప్రెసిడెంట్ నాగవాణి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు నిరసనగా దీక్ష చేపట్టామన్నారు. రాధిక, రాజసుకన్య, వాణి, శైలజ, ఉమాదేవి, మంజుల తదితరులు పాల్గొన్నారు.
- దంతాలపల్లి : కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం తొర్రూరు డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న, సబ్ డివిజన్ కార్యదర్శి చిర్ర యాకయ్య మాట్లాడుతూ కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి పాల్పడ్డ నిందితులను గుర్తించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉమేష్, ప్రసాద్, వీరన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

'కమ్యూనిస్టు విప్లవ యోధుల అసమాన త్యాగాలు'

బయ్యారం, ఆగస్టు 21 : పీడిత ప్రజల విముక్తి కోసం అసమాన త్యాగాలు చేసిన కమ్యూనిస్టు విప్లవ యోధులు చూపిన బాటలో సమసమాజ స్థాపనకై పోరాడాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, గౌని ఐలయ్య పిలుపునిచ్చారు. న్యూడెమోక్రసీ సీనియర్ నాయకులు చేపూరి రంగన్న స్మారక స్థూపాన్ని బుధవారం కారుకొండ గ్రామంలో ఎన్డీ నేతలు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ ఎమర్జెన్సీ కాలం నుంచి నాలుగున్నార దశాబ్దాల పాటు బయ్యారం ఏజెన్సీ ప్రాంతంలో కమ్యూనిస్టు విప్లవకారులకు రంగన్న వెన్నుదన్నుగా నిలిచాడన్నారు. మూడుసార్లు ఉపసర్పంచ్‌గా పనిచేసిన రంగన్న ఏజెన్సీ ప్రజలతలలో నాలుకలా మెలిగాడని కొనియాడారు. జండాలతో నిమిత్తం లేకుండా పాలక పార్టీలన్నీ ఆదివాసి గిరిజనులకుఅన్యాయం చేస్తున్నాయని, సీతారామ ప్రాజెక్టు నీటి విషయంలో ఆదివాసీలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఈ బహిరంగ సభలో ఇంకా పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు బండారి ఐలయ్య, జడ సీతారామయ్య, సత్యనారాయణ, ఊకె పద్మ ప్రసంగించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి మోకాళ్ల మురళీక్రిష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎన్డీ నేతలు నరసింహా, నాగేశ్వరరావు, లింగన్న, సమ్మయ్య, వీరస్వామి, బిక్షం, బిక్షపతి, కొమరయ్య, చైతన్య, మధు, మల్లయ్య, జనార్థన్, వెంకటేశ్వర్లు, రాము, ఉపేందర్, శోభన్ పాల్గొన్నారు. అంతకుముందు స్మారక స్థూపాన్ని ఎన్డీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, పార్టీ జెండాను సీనియర్ నాయకులు మోకాళ్ల వీరస్వామి ఆవిష్కరించారు.


కారుకొండలో చేపూరి రంగన్న స్మారక స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న ఎన్డీ నేతలు

'బంజార గోర్‌బోలీ భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలి'

నెహ్రూసెంటర్, ఆగస్టు 21 : భారతదేశంలో 14 కోట్ల మంది బంజారాలు మాట్లాడుతున్న గోర్‌బోలీ భాషను భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) జాతీయ కార్యదర్శి గుగులోతు హరినాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని లయన్స్‌క్లబ్ భవన్‌లో బుధవారం జిల్లాస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరినాయక్ మాట్లాడుతూ ఎల్‌హెచ్‌పీఎస్ పూర్వవైభవం కోసం పటిష్టమైన నిర్మాణం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు లంబాడీలు ఉద్యమాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. వంద రోజుల్లోనే గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని చేవేళ్లలో ఇచ్చిన డిక్లరేషన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని పేర్కొన్నారు. వంద రోజులు దాటినప్పటికి ఆ హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. తెలంగాణలోని గిరిజనులందరిని ఐక్యం చేసేందుకు రాష్ట్రంలో 33 జిల్లాలను పర్యటించి క్షేత్రస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షు రాంబాల్‌నాయక్, సక్రునాయక్, రమేష్‌నాయక్, వెంకట్‌నాయక్, ఆంగోతు రవి, గోపి, మంగీలాల్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ కార్యదర్శి హరినాయక్

తొలగించిన జీపీ ఉద్యోగిని నియమించారని ఫిర్యాదు

కేసముద్రం, ఆగస్టు 21 : కేసముద్రం విలేజి గ్రామపంచాయతీలోని ఒక తాత్కాలిక ఉద్యోగిని తొలగిస్తూ జీపీ తీర్మానం చేసినప్పటికీ తిరిగి విధుల్లోకి తీసుకున్నారని జిల్లా కలెక్టర్‌కు గ్రామస్థులు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది జనవరి 8 నుంచి విధులకు హాజరుకాకపోవడంతో గతనెల 24న జీపీ తీర్మానంతో సదరు ఉద్యోగిని తొలగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా ఇటీవలె సదరు ఉద్యోగిని మళ్లీ విధుల్లో చేర్చుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే ఉద్యోగి గ్రామంలో అక్రమంగా ఇంటి నెంబర్లను జారీ చేసి తాను ఖరీదు చేసిన ఇంటిస్థలానికి తప్పుడు ఇంటి నెంబరుతో కబ్జా చేశాడని మాజీ సర్పంచ్ సట్ల నర్సయ్య కుమార్తె తేజస్విని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

'ప్రభుత్వం పీఆర్‌సీని ప్రకటించాలి'

కేసముద్రం, ఆగస్టు 21 : పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేస్తూ 50శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీని ప్రకటించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి కోరారు. మండలంలోని తాళ్లపూసపల్లి, కల్వల ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలో బుధవారం సంఘం సభ్యత్వ నమోదును నిర్వహించారు. మండల అధ్యక్షుడు బీరం జనార్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపాల శ్రీధర్, పీజీహెచ్‌ఎంలు కోట కనకయ్య, బండారు నరేందర్, పత్తి వీరస్వామి, సురేష్‌నాయుడు, వెంకటేశ్వర్లు, ఉపేందర్, ప్రవీణ్, సురేష్, హరికృష్ణ, రాజ్‌కుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

వర్గీకరణను వెంటనే అమలు చేయాలి

నెహ్రూసెంటర్, ఆగస్టు 21 : సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకనుగుణంగా ఎస్సీ వర్గీకరణను తెలంగాణ రాష్ట్రంలో వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్-దండోరా జాతీయ కార్యదర్శి కొండ్ర ఎల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి బుధవారం సంఘం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. నాయక్‌పోడు సంఘం జిల్లా అధ్యక్షుడు పులి శ్రీను, సీహెచ్.రాధ, కుక్కల సుధ, సందీప్, ధర్మారపు రమ, సమ్మయ్య, దేవి, ఉపేందర్, కందిపాటి నాగరాజు, కందుకూరి వీరన్న, శుక్ర కుమారి, మిర్యాల ఎల్లయ్య, భాస్కర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఫేక్ వాట్సాప్ కాల్స్‌తో మోసపోవద్దు

- నెల్లికుదురు ఎస్సై రమేష్‌బాబు

నెల్లికుదురు, ఆగస్టు 21 : ఫేక్ వాట్సప్‌కాల్స్‌తో పోలీస్‌లమని ఫోన్‌చేస్తే మోసపోవద్దని ఎస్సై సీహెచ్.రమేష్ బాబు తెలిపారు. మండలంలోని మునిగలవీడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి బుధవారం పోలీస్ వేశధారణలో వాట్సప్ కాల్‌చేయగా, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మునిగలవీడు గ్రామానికి చెందిన ఓవ్యక్తికిపోలీస్ వేశాధారణలో వాట్సప్ విడియో కాల్‌చేసి మీ అబ్బాయి డగ్స్‌కేసులో నిందితుడు, గ్యాంగ్‌రేప్‌లో నిందుతుడని రూ. 50 వేలు పంపిస్తే కేసుకొట్టి వేస్తామని ఫేక్ కాల్స్‌చేసి బ్లాక్‌మేల్‌చేసినట్లు తెలిపారు. వాస్తవంగా పోలీస్‌లు ఫోన్‌చేసి ఎలాంటి సమాచారం కోరరని, ఫేక్‌కాల్స్‌వస్తే ఎత్తవద్దన్నారు. ఫేక్‌కాల్స్‌పట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ఆస్పత్రిలో మందుల కొరతను తీర్చాలి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 21 : జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మందుల కొరతను తీర్చాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో బుధవారం నిర్వహించిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అత్యధికంగా దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల ప్రజలున్నారని వారు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకు సర్కార్ ఆస్పత్రికి పోతే మందులు లేవని చెప్పడం బాధకరమన్నారు. ఇప్పటికైనా సరిపడ మందులు అందుబాటులో ఉంచకుని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్య, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలన్నారు ఈ సమావేశంలో బిల్లకంటి సూర్యం, ఫైండ్ల యాకయ్య, బండపల్లి వెంకటేశ్వర్లు, మందుల వీరన్న, రాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి టీపీటీఎఫ్ కృషి


మండల అధ్యక్షుడు సతీష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

పెద్దవంగర, ఆగస్టు 21 : రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీపీటీఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం పెద్దవంగరలో టీపీటీఎఫ్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిక్కాల సతీష్, ప్రధాన కార్యదర్శిగా వల్లాల శ్రీనివాస్, జిల్లా కౌన్సిలర్‌గా రవీందర్‌రెడ్డిను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీల్లో అనధికారికంగా చేసిన టీచర్ పోస్టుల రేషనలైజేషన్ కారణంగా పాఠశాలల్లో టీచర్ల కొరత ఏర్పడిదని, బదిలీల్లో చాలామందికి సరైన స్థానాలు లభించలేదన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అందరి సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమావేశంలో లక్ష్మణ్, యేగేందర్, కల్యాణి, ఎల్లగౌడ్, లావణ్య, తిరుపతిరెడ్డి, మురళి, నర్సయ్య, దయాకర్ పాల్గొన్నారు.

కృష్ణకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్



మరిపెడ, ఆగస్టు 21 : మునిసిపల్ పరిధి చోక్లాతండాకు చెందిన బానోత్ కృష్ణ ఓయూ నుంచి డాక్టరేట్ సాధించారు. బుధవారం యూనివర్సిటీ అధికారులు పీహెచ్‌డీకి ఎంపికైన అభ్యర్థులను వెల్లడించారు. 'ఏ ఫోనోలాజికల్ స్టడీ అంబాడి అండ్ ఇంగ్లీష్ ఏ డిస్క్రిప్టివ్ స్టడీ' అనే అంశంపై వివిధ పరిశోధనలు చేసి సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్‌కు ఎంపిక అయ్యారు. గైడ్ చేసిన ప్రొఫెసర్లు రమేష్‌కుమార్, బాలునాయక్, సీఎస్ స్వాతి, బీవోఎస్ సుశీల్‌కుమార్‌లకు కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. నేషనల్ ఫెలోషిప్ ఇచ్చిన భారత ప్రభుత్వానికి ఎంతో రుణపడి ఉంటానని పేర్కొన్నారు.

'అసత్య ఆరోపణలు మానుకోవాలి'

తొర్రూరు, ఆగస్టు 21 : తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన రాజీవ్‌గాంధీ కుటుంబంపై బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ అసత్య ఆరోపణలు మానుకోవాలని టీపీసీసీ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ముత్తినేని సోమేశ్వర్‌రావు అన్నారు. బుధవారం తొర్రూరులో ఆయన మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటిస్తే తొలగిస్తామని కేటీఆర్ అనడం దిగజారుడు తనమన్నారు. అది ఆయన అవివేకానికి నిదర్శనం అన్నారు. మాజీ మంత్రిగా నియోజకవర్గాన్ని ఐదేళ్లు పాలించి రుణమాఫీ చేయలేని దయాకర్‌రావు మండలాల్లో ధర్నా చేయడం సిగ్గుచేటన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

నర్సింహులపేట, ఆగస్టు 21 : ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని నర్సింహులపేట బీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు ఖజామియా మాట్లాడుతూ ప్రతి రైతుకు రూ.2 లక్షలు బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆంక్షలు విధించి రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు జగదీశ్వర్, మాజీ ఉప సర్పంచ్ నాగన్న, మాజీ ఎంపీటీసీ వెంకన్న, వేంకటేశ్వరస్వామి ఆలయ మాజీ చైర్మన్ బొల్ల రమేష్, నరసింహారెడ్డి, నరేష్ యాదవ్, నర్సయ్య, లింగన్న, రామాచారి, రామకృష్ణ, మదార్, ఆలువాల నవీన్, చంద్రారెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

వీరభద్రుడి సన్నిధిలో ప్రవచనాలు

కురవి, ఆగస్టు 21 : కురవి భద్రకాళి సమేత వీరభద్రస్వామిని నైనిశారణ్య పీఠాధిపతి శ్రీబాల బ్రహ్మానంద సరస్వతి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయంలో శ్రీవీరభద్రస్వామి తత్వం గూర్చి బుధవారం ప్రవచనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈవో సత్యనారాయణ, వేద పండితులు బాలకృష్ణ, శ్రీకాంత్‌శర్మ, అర్చకులు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక మండల కమిటీ ఎన్నిక

నెల్లికుదురు, ఆగస్టు 21 : జనవిజ్ఞాన వేదిక మండల కమిటీ ఎన్నిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్నికల అధికారి చిర్ర యాకాంతంగౌడ్ సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేశెట్టి యాకన్న, ప్రధాన కార్యదర్శిగా మర్రకట్ల అనిల్ కుమార్, ఉపాధ్యక్షులుగా పెద్దూరు వెంకటేశ్వర్లు, కూన సతీష్, కోశాధికారిగా కందికొండ బాబు, చెకుముకి కన్వీనర్లుగా ఎండీ సలీమ్, ప్రదీప్‌కుమార్, హెల్త్ కన్వీనర్‌గా జి.అరుణ, సైన్స్ కన్వీనర్‌గా మహేందర్, విద్యా కన్వీనర్‌గా నాగేశ్వర్‌రావు, సమతా కన్వీనర్‌గా భవాని సోషల్‌మీడియా కన్వీనర్‌గా కొత్త సుభాష్, గౌరవ అధ్యక్షులుగా స్వప్న, కురపాటి వెంకటేశ్వర్లులను ఎన్నుకున్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రకాష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రుణమాఫీలో జాప్యం తగదు : బీజేపీ


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ కిసాన్ మోర్చా నేత శ్రీనివాస్‌రావు

గార్ల, ఆగస్టు 21 : గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతులకు ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీ పథకంలో జాప్యం లేకుండా ప్రతీ ఒక్కరికి వర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు బుధవారం గార్లలో బీజేపీ కిసాన్ మోర్చా మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో రైతులకు సగంమందికి రుణమాఫీ అమలు కాక పోవడంతో రైతులు బ్యాంకులు ఆఫీస్‌ల చుట్టు తిరుగుతున్న పట్టించుకొనే నాథుడే కరువయ్యారని ఆయన విమర్శించారు. విమల్‌కుమార్‌జైన్, గుండెబోయిన నాగమణి, దేవానాయక్, అజ్మీరా రాము, వీర్యానాయక్ పాల్గొన్నారు.

ఘనంగా సీనియర్ సిటిజన్స్ డే

దంతాలపల్లి, ఆగస్టు 21 : మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో గల అమ్మఒడి ప్రేమ శరణాలయంలో తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్టా సరిత ఆధ్వర్యంలో ప్రపంచ సీనియర్ సిటిజన్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె ఉచిత న్యాయసేవా సంస్థల ద్వారా అందిస్తున్న సేవలపై వివరించారు. అనాథలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు దారం కుమారస్వామి, ఎస్సై పి.రాజు, పోలీసు సిబ్బంది శంకర్ పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలి

నెహ్రూసెంటర్, ఆగస్టు 21 : జిల్లాలో విస్తరిస్తున్న కీటక జనిత వ్యాధుల నివారణ కోసం వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌వో మురళీధర్ సూచించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మురళీధర్ మాట్లాడుతూ వర్షాకాలంలో ముఖ్యంగా చికెన్‌గున్యా, డెంగీ, మలేరియా, ఫైలేరియా వ్యాధులు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురికి కుంటల్లో దోమలు పెరగకుండా లార్వాలను డిస్కవర్ చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వసతి గృహాలను సందర్శించాలన్నారు. మలేరియా, డెంగీ బారిన పడిన వసతి గృహాల విద్యార్థులు అందుబాటులో ఉన్న పీహెచ్‌సీల వైద్యులను సంప్రదించాలన్నారు. వైద్యులు సరిపడ మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ సుధీర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, కేవీ.రాజు, గీత, రుక్మోద్దీన్ పాల్గొన్నారు.